# చావు బ్రతుకులు

అసుర సంధ్యవేళకింకా అరగంట వ్యవధి వున్నది. అది ఒక మహానగరం నాలుగు వీధుల మొగ. అయినా కాలాన్ని గడియారం ముళ్లతో సంకేతించక, పై విధంగా చేసేవు ఎందుకు? అని అడగ వచ్చును.

అందుకు కారణం- ఆ నాలుగు వీధులలోను ఒక వీధిలోనుంచి నేను వస్తున్నాను. నాకెదురుగా వున్న దిక్కు పశ్చిమం. బాట కొక వేపు వూడలు దిగకుండ నరికి వేసిన రెండు మజ్జి చెట్లున్నాయి. ఆ సమయాన ఆ చెట్టు మీది పిట్టలు సాంధ్య గీతికల రొద చేస్తున్నాయి!

అది రద్దీ అయిన సెంటరు. వచ్చేజనం, వెళ్ళేజనం. ఫుట్‌పాత్ మీద అడుగు పెట్టేందుకు, నాలాటి పిరికివాడూ, అప్రయోజకుడూ-అడుగెడుదామన్నా జాగా లేదు.

ముష్టివాళ్ళు.... తదితర చిల్లర అంగళ్లూనూ...

అక్షణంలో అక్కడ ముష్టివాళ్లూ మనమూ అంటే నా ఉద్దేశం బాట సారులం సగం సగం.

అంత ముమ్మరం యాచకులు. అడగడం వాళ్ల మామూలు.... ఇవ్వలేకపోవడం మనకలవాటు.

ఐతే యీ వూరికి అయిన వాళ్లకంటే కాని వాళ్లే ఎక్కువ-

పై వూళ్లనించి సినిమాలకని తదితర వ్యాపారాల మీదా, ఎగబడే జనం జాస్తీ.

ఈ ముష్టివాళ్లల్లో, సగం మందికి అందుకు అర్హత లేదని నాకొక్కడికే తెల్సుననుకోవడం నా వాజమ్మతనం... అది బాటసారులలో అందరూ ఆలోచించరు గానీ.

క్రీగంట పరిశీలించినా, ప్రతివాడికీ తెలుస్తుంది.

అయితే సినిమాకి వేళ అయిపోతున్నది వొకరికి...

రైలు మించిపోతున్నదింకొకరికి....అంపలు దుంపలు తెంచుకు పరిగెత్తే వాళ్ళు యివెక్కడ గమనిస్తారు?

కాఫీ నీళ్లు తాగడానికి పదిహేను నాయాపైసాలు, కొండకచో యిరవై నయాపైసాలు-లేమి, బీదకవి ఎవడేనా చూడాలి...నాలాంటి అర్భకుడు చూడాలి. కవి చూస్తే గబగబా కలం దీసి, సిరా ఎరువైనా ఎక్కడయినా తెచ్చి ఓ పద్యం రాస్తాడు.

ఐతే దాన్ని ముష్టివాళ్లు చదవలేరు. వాళ్లు చదువుతాము. అన్నా కవి యివ్వడు. మిగతా వాళ్ళు చదివినా కన్నీళ్లు ఎందుకుగాని, నయాపైసా అయినా రాల్చరు.

అసలు యింతకీ నేను చావు విలువ సంగతి కదూ చెపుతూవుంట...లేదా చెబుతానంట...సదరు చావు లాకాయి లూకాయిగాదు...ఒక ముష్టివాడి చావు. అందులోనే ఒక కాలూ, ఒక చెయ్యో అరచెయ్యో-సరిగ్గా గుర్తులేదు- కాని లేనివాడి చావు.

నన్ను ఒక వ్యక్తి అమాంతం నిలదీసేడు. అంత పరిశీలనగా చూడలేదు గాని అతగాడు, చింకినిక్కరు, చింపిరి జుట్టూ వేసుకున్నాడు... బనీను చిరిగిపోయింది. పనిగట్టుకుని రోడ్డుమీద దొర్లినట్టుంది మొహం.

"అయ్యా...కనికరించాలి....దిక్కుమాలినోడు దిక్కులేని చావు చచ్చేడు... పూడ్చాలి....ఒక్క అణా ధర్మం...ఒక్క అణా!

నేను విదిలించుకోబోయేను. దారి కాసిన దొంగాడ్ని చూసిన, అనగనగా కథలో శెట్టిగారిలాగ తొట్రుపాటు పడ్డాను.

నాకు పది అంగల కవతల అతగాడికి సైడు పోజులా వున్నాడింకో వ్యక్తి. మరో పెద్ద మనిషిని...యీ విషయం మాట వరుసకి అంటున్నాను సుమా...అతగాడు ఎంత పెద్దమనిషో నేనెరుగను సుమా...నిలదీస్తున్నాడు.

"అయ్యా...దిక్కులేక, ఆకలికి చచ్చిపోయేడు మా మావ..కాల్చాలి బాబూ...ఒక్క అణా... ధర్మం"

అయితే యింతకీ ఆ శవాన్ని కాలుస్తారా? పూడుస్తారా...? దాన్ని పూడ్చి కాలుస్తారా... కాల్చి పూడుస్తారా... ఇవి వెంటనే వచ్చిన అనుమానాలు గావునాకు...ఆక్షణంలో ఆమాయదారి గోల తప్పించుకుని, ఒక రెండు నయాపైసల బిళ్ల వాడి చేత పడేసి తప్పుకున్నాకా, కలిగిన సందేహమది.

ఏదో వొకటి చేస్తారు లెమ్మని వూరుకొన్నాను.

పాపం! యెంత దిక్కు మాలిన చావు?

గుక్కెడు నీళ్ల పోసిందికి కూడా ఎవరూ లేరు కదా వాడికి...పున్నామ నరకం ఎలాగూ తప్పదు కదా వాడికి....అదెలా గనుకుంటాం లెండి...కొడుకులు వుండే వుంటారు. అసలు యింతకీ ఆ ముసలి పీనుగుకి కాలూ చెయ్యి మొదట్నించీ లేవూ అన్న నమ్మకం యేమిటీ?

గంతకి తగ్గ బొంత, వాడికో పెళ్లామూ పిల్లా పీచూ వుండే వుంటుంది. అటు తర్వాత వాడి

సర్వశక్తులూ వుడిగేకా అది దాని దారినా, చెడబుట్టిన కొడుకులు వాళ్లదారిన పోయుండ రాదా?

వాడి సంసారం ఆవిధంగా చెట్టుకో పిట్టయి వుంటారు.

ఏమో ఎవరు చూడొచ్చారు?...దరిమిలా ఏ రైలు క్రిందో పడితే అకాలు పోయిందో ఏమో పాపం... ఇంతకీ కర్మ...విధి విలాసము! ఎప్పటికే చావు పెట్టేదో..

బ్రతుకెంత విలువైనదీ...బోలెడు గొప్పగా బ్రతికీ..

ఎంతో మంది-"ఇంటి వెనకాల" అన్నట్లు దిక్కుమాలిన, విలువ తక్కువ చావులు చావడం లేదూ..

అయితే కొందరి బ్రతుకుకన్నా చావుకే ఎక్కువ విలువ...

చావు సంగతి వస్తే యీ ముష్టివాడి దోలెక్కా... జమా...రెండూ లేదు. వీడిని జనాభాకి ఎక్కించరు... ఆనక దానిలోనుంచి తప్పించరు...

అయినా, నా వెర్రిగాని వాడికేం కర్మ...ఇంచక్కా యీ దుక్కల్లాంటి నలుగురూ మోసుకుని వెళ్లి తగలెడతారు.. ఆనక చెప్పలేం...ఏ స్మారక చిహ్నమో నెలకొల్పినా కొల్పుతారు...

నా అసలు పని మరచిపోయాను. అసలు పరధ్యానంలో... దీపాలు వెలిగి అరగంటయినా అయ్యుండాలి.

బజారుతరహా మారింది...సాయంతరం రద్దీ తగ్గింది.

గొల్లభామ మార్కు పాలడబ్బా పాలే గాని మరోటి తాగడట చంటాడు. గొల్లభామ పాలు...గొల్లభామ పాలు అని అడుగుతాడా రెండేళ్ళ కూనా?... అందుకనే మా ఆవిడని ముక్కుమీద గుద్దబుద్దేస్తోంది. గొల్లభామ బొమ్మ చూడొచ్చాడా చంటాడు డబ్బామీద లేక చదవొచ్చాడా..?

వూ,...అయితే కంఠశోషయే మిగులు... కొనక తప్పుతుందా?

బ్రతకాలి అన్నాకా ఏదీ తప్పదు...ఇందాకా వాడి చావుకి రెండు నయాపైసాలు యివ్వలేదామరి...అంతే...

తిరుగుదలలో నాకింకా ముసలివాడి శవం సంగతి మరుపుకి రాలేదు.

పరిశీలనగా చూశాను.

అంతకు క్రితం పనిగట్టుకుని శవాన్ని చూడ్డం యేవిఁటీ! యీ సంగతి యింటి దానితో నోరు జారి అన్నానూ అంటే యిప్పుడు చన్నీళ్ళలో తలముంచమంటుంది...అనుకున్నాను గానీ...

ఒక కంట చూడకపోలేదు. చూచాయగా అగుపించింది. మాసిన మురికి గుడ్డ ఒకటి, తొడల వరకూ కప్పి వున్నది. మసక వెల్తురు అసలే...మరింతగా అది చీకట్లలో కలిసిపోయింది.

అందుచేత నాకు జ్ఞాపకమే. ఆ జాగా గుర్తువుంది.

ఇప్పుడు అదే స్థానంలో ఒక ముష్టివాడే...

వాడి శవం గాదు...'' ''కళ్ళు లేవు బాబూ! కాళ్ళు లేవు నాన్నా'' అంటూ వున్నాడు.

వాడేవీడా?...ఛీఛీ! ఏం మాటలివి..?

ఎంత సంకుచిత తత్వమిది?.. మా రామానుజం గాడు -కవిలెండి...విన్నాడూ అంటే నా మీద కథ రాసి అటుమూడు తరాలు, యిటు మూడు తరాలు, దుయ్యబడతాడు. అక్కడికీ వాడే ''పతిత బీద యిత్యాది జనోద్ధారకుడు'' ఐనట్లు...

వీడిని పోలిన ముష్టివాళ్ళే యీదేశంలో కొల్లలు వుండొచ్చును. కాని యింకో సంగతి నా దృష్టిని ఆకర్షించింది.

ఇందాకటి, బనీను వాలా అనుకుంటాను, అక్కడ జాంపళ్ల దుకాణందగ్గర...వొరి వీడి అసాధ్యం గూలా...అసలింతకీ అది వీడి...సరిసరి ఎవరైతే నాకేం...

ఐనా ఉండబట్టక వో రెండు జాంపళ్లు కొనే మిషతో ఆ దుకాణం దగ్గర కెడితే...

అనుకుంటూనే దగ్గరికి వెళ్లేను. జాంపళ్లది... దూరానికేదో దోరగా కనిపించింది గాని...అబ్బే...ఖారాకిల్లీ యిదీనూ...అరవదో, మళయాళందో...యింతకీ దాని గొడవ ఎందుకు నాకూ...''

రెండు పళ్లు, ఎలాగా తప్పదని బేరమాడి కొనుక్కొని... ఆ బిచ్చగాణ్ని తెగించి అడిగేను.

''ఏమిరా...అబ్బీ! యిందాకటి ఆదిక్కుమాలిన శవాన్ని పూడ్చేరా, కాల్చేరా?'' అని

''వాడు, నీదేవూరు? ఏభాష?'' అన్నట్టు చూసేడు నాకేసి.

మళ్ళీ యేమనుకున్నాడో యేమో గానీ

''ఎదవనాయాళని, పూడుస్తామా? ఇయాళ నాయాళ ''గంటకి'' రొండు రూపాయలుకి చచ్చేడు''-అని తనలో తాను విసుక్కున్నాడు.

నాకర్థం అవలేదు వాడి ధోరణి. కాని వాడితో నాకు సంభాషణ యేమిటీ? కయ్యామూ వియ్యమూ సమవుజ్జీలతో అన్నారు. వియ్యం సంగతి అసలు రాదు గాని, కయ్యం, రాదూ అన్న భరోసా ఏదీ?

ఏమో వెధవ . నేను ఏనోరు జారినా ఓ అశ్లీలం మాటాడొచ్చును. ఆనక యజ్ఞోపవీతం తెంచుకున్నాలాభం యేమిటి? అంట! నేను యింటి మొహం పట్టేను.

మరి వారం రోజుల తర్వాత, ఆఫీసు నుంచి వచ్చే వేళ ''బాబూ ధర్మం.... దిక్కుమాలిన చావు'' అంటూ యిది వరకటి రకమే చింకి బనీను వాలా నిలవేయడంతో విసుక్కున్నాను. తప్పుకున్నాను.

ఈసారి కూడా, ఓ చూపు శం మీద విసరకపోలేదు. ఆశ్చర్యం. ఈ శవానికీ ఒక కాలులేదు.

కుళ్ళుగడ్డలోనించి తొంగిచూసే మొండి చెయ్యి!

ఓరి!వీళ్ల అస్యాధ్యం కూలా...శతకోటి దరిద్రాలకీ, అనంతకోటి ఉపాయాలూ అనీ...యీ పింజారీ వెధవ చావు నిజం, కాదూ...అందుకా ఆ వెధవ కానా ఆరోజు, గంటకీ రెండు రూపాయలు అవి విసుక్కున్నాడు.

రెండు రూపాయిలే...విస్తుపోయేను. ఈ చావు బ్రతుకుల మధ్య గిలగిలలాడే కుంటివాడి దొంగ చావు విలువ, గంటకి ఎన్నో రూపాయలు!

అమ్మ బాబోయి! ఎంత ఓవర్‌టైమ్ చెయ్యాలి నేను..

నా రోజూవారీలో గంటకది యెన్నిరెట్లు...అయితే వెధౌది... నేనుచావలేను గదా...

అధవా చచ్చినా, కాలూ చెయ్యీ.....దిక్కూ మొక్కూ అందరూ వున్నారు కదా...

ఛీ ఛీ! ఎంత ఓగాయిత్యం...అనుకుని ముసిరే చీకట్ల మధ్య వెలిగే దీపాల తోరణాలు దాటుతూ, వెలిగే దీపాల నీడ, ఆఖరికి బ్రతకడం కోసం చావుసైతం నేర్చుకున్న మానవతని జూస్తూ యిల్లు చేరుకున్నాను.

అటు తర్వాత యిటువంటి సంఘటనలు చూడటం నాకు మామూలయిపోయింది. అసురసంధ్య వేళకి శవం మాయమవుతుంది.

మళ్ళీ ఎలాగో నలుగురి కళ్ళూగప్పి బ్రతికి, మరో తర్వాత... మరో మొగని,అసుర సంధ్యవేళకి అరగంట ముందు ఛస్తుంది?

నాకు చిరునవ్వు విరిసింది పెదవుల మీద. అదీ బ్రతుకు తెరువే మరి! మనకెందుకు? వాళ్లకడుపు కొట్టడం? అనుకున్నాను.

ఆవేళ నేను తిరిగి వచ్చేస్తున్నా.. బజారు నుంచి...యింకా ఆ "శవం" వుంది?...

నాముక్కున అనుకోకుండా వేలుంచుకున్నాను.

ఈసారి శవం మీద గుడ్డి యీగలు వాలుతున్నాయి.

"ఏమ్రా" అనడానికి అంత సందడీ, సద్దూ వున్న ఆనగరపు నడివీధిలో యెవరూ తటస్థపడలేదు.

చింకినిక్కరు వాలాలు...మాసిన బనీను వాలాలూ ఏరీ?....

కాని యీసారి యిది వాడి అసలు చావు..

ఇదీ దాని నిజం విలువ...అనుకుంటూ యింటిముఖం పట్టేను.

(1960, కృష్ణాపత్రిక వారపత్రిక)